

సదస్సుకు మూడు జిల్లాల కలెక్టర్లు దూరం

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే కలెక్టర్ల సదస్సుకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు హాజరు కావడంలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అనుమతి కోసం విశాఖ కలెక్టర్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. అయితే సదస్సులో జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్తు కార్యాచరణపై వివరించాల్సి ఉంటుంది. అయా అంశాలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఈసీ అనుమతి ఇవ్వలేదని సమాచారం.

విశాఖ రైల్వేస్టేషన్‌లో భయం... భయం

ఆగి ఉన్న కోర్బా రైలు ఏసీ కోచ్‌లలో అగ్ని ప్రమాదం

- ఉవ్వెత్తున ఎగసిపడిన మంటలు
- దట్టంగా వ్యాపించిన పొగ
- బెంబేలెత్తిన ప్రయాణికులు



బోగీ నుంచి దట్టమైన పొగలు

- ప్రాణభయంతో స్టేషన్ బయటకు పరుగులు
- మంటలు అదుపుచేసేందుకు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఆర్ఎం, సీపీ బాగ్చీ

ఎటు చూసినా జనం... తాము ఎక్కాల్సిన రైళ్ల కోసం కొందరు... దిగి ఇంటికి చేరుకునే ఆత్రుతలో మరికొందరు.. ఇలా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో సందడి వాతావరణం నెలకొంది. సరిగ్గా సమయం ఉదయం 9.20 గంటలు.. ఒక్కసారిగా దట్టమైన పొగ స్టేషన్‌ను కమ్మేసింది. అంతలోనే ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అందరిలోనూ ఆందోళన... ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి. అంతే ప్రయాణికులంతా ప్రాణభయంతో స్టేషన్ బయటకు పరుగులు తీశారు. నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ కాలిపోతోందనే వార్తతో సర్వత్రా భయాందోళన నెలకొంది. అప్రమత్తమైన యంత్రాంగం మంటలను అదుపుచేసే చర్యలు చేపట్టినా... ప్రయాణికుల్లో ఆందోళన మాత్రం తగ్గలేదు.



బోగీలోని మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 4:

విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కోచ్‌ల నుంచి ఎగిసిన మంటలు, దట్టమైన పొగ భయభ్రాంతులకు గురిచేసింది. రైళ్ల కోసం ప్లాట్‌ఫామ్‌లపై నిరీక్షించిన ప్రయాణికులను బెంబేలెత్తించడమే కాకుండా ప్రాణ భయాన్ని కలిగించింది. స్టేషన్‌ను కమ్మేసిన పొగ, చెలరేగిన మంటలను చూసిన కొందరు పెద్దగా కేకలు వేయడంతో వివిధ ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న ప్రయాణికులు స్టేషన్ బయటకు పరుగు తీశారు. ఏం జరుగుతుందో తెలియక రైల్వే సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. నాల్గో నంబరు ప్లాట్‌ఫామ్‌పై వ్యాపారం నిర్వహించే సిబ్బంది స్టాల్స్‌ను వదిలిపెట్టి పరుగందుకున్నారు.

గందరగోళంగా రైల్వే స్టేషన్

అగ్ని ప్రమాదం సంభవించిన నాల్గో నంబరు ప్లాట్‌ఫామ్‌కు రైల్వే సిబ్బంది, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పరుగులు తీయడంతో స్టేషన్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగ



4వ నంబరు ప్లాట్‌ఫారం వద్ద పరిస్థితిని చక్కదిద్దుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు

... మిగతా 7వ పేజీలో

4వ నంబరు ప్లాట్‌ఫారానికి ఏమైంది?

- నాలుగు నెలల క్రితం కుంగిన ఆర్‌ఓబీ
- ఇప్పుడు అక్కడే ఏసీ బోగీల దగ్ధం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వేస్టేషన్ రాష్ట్రంలో అత్యంత ప్రధానమైనది. విజయవాడ తరువాత ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్. ఇక్కడ నాలుగు నెలల కాలంలో రెండు భారీ ప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్ ఎనిమిదో తేదీన ముఖద్వారం వైపు దక్షిణాన ఉన్న రైల్ ఓవర్ బ్రిడ్జి మూడు - నాలుగు నంబర్ ప్లాట్‌ఫారాల మధ్య ఆకస్మికంగా కుంగిపోయింది. సాధారణంగా ఇలాంటి రైల్వే స్టేషన్లలో రెగ్యులర్ నిర్వహణ పనులు జరుగుతుంటాయి. ఆర్ఓబీలకు ఏదైనా సమస్య ఉంటే గుర్తించి ముందే మరమ్మతులు చేస్తారు. కానీ ఇక్కడ కుంగిపోయిన తరువాత గానీ అధికారులు గుర్తించలేకపోయారు. కిందికి దిగిపోయిన ఆర్ఓబీపై నడవడానికి ప్రయాణికులు భయపడడం గమనించి వెంటనే రాకపోకలు నిలిపివేశారు. క్రేన్ల సాయంతో యుద్ధ ప్రాతిపదికన క్రేన్ల పనులు చేపట్టి నెల రోజుల తరువాత పునరుద్ధరించారు. ఇప్పుడు అదే నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపై కోర్బా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఏసీ కోచ్‌లలో అగ్నిప్రమాదం సంభవించింది. నడుస్తున్న రైళ్లలో ప్రమాదాలు సంభవిస్తుంటాయి. కానీ ఆగిఉన్న, విద్యుత్

... మిగతా 7వ పేజీలో

పోటీకి టీడీపీ సై

అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్



- ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో గండి బాబ్జీ, పీలా గోవింద్, పీవీజీ కుమార్
- నేడు విశాఖలో భేటీ కానున్న ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు



గండి బాబ్జీ



పీలా గోవింద్



పీవీజీ కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థి ఎంపికపై నేతలు కసరత్తు ప్రారంభించారు. శనివారం అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్ ఇంట్లో గ్రామీణ ప్రాంత నేతలు సమావేశమయ్యారు. ఎన్నికలకు పార్టీ తరపున ఓటర్ల వివరాలపై చర్చించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి పార్టీ తరపున పోటీ చేసేందుకు విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌లను కలిసి అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంకా మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాగా బీజేపీ నుంచి గ్రామాధికారుల సంఘం మాజీ నేత ఈర్లె శ్రీరామమూర్తి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఈ నెల ఆరో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నందున అభ్యర్థిని త్వరగా ఎంపికచేయాలని అధిష్ఠానం సూచించింది. ఇప్పటికే వైసీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ప్రకటించడంతో టీడీపీ తరపున అభ్యర్థి ఎంపికకు సోమవారం రాత్రి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఇంట్లో ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, శాసనసభ్యులు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు అధ్యక్షులు భేటీ కానున్నారని సమాచారం. అయితే కలెక్టర్ల సదస్సుకు హాజరవుతున్నందున హోంమంత్రి అనిత హాజరుకావడం లేదని తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రేపు

- రిటర్నింగ్ అధికారిగా విశాఖ జేసీ
- సహాయ రిటర్నింగ్ అధికారులుగా డీఆర్వోలు
- మొత్తం ఓటర్లు 838 మంది

- 7లో

అన్న క్యాంటీన్ భవనాలు ముస్తాబు

ప్రారంభానికి సిద్ధం చేస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4:

అనకాపల్లిలో అన్న క్యాంటీన్ భవనాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ ప్రధాన మార్గం వద్ద ఉన్న రెండు అన్న క్యాంటీన్ భవనాలను జీవీఎంసీ అధికారులు రూ.28 లక్షలతో అందంగా తీర్చిదిద్దారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ రెండు చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదలకు రూ.5లకే ఉదయం వేళ అల్పాహారం, రూ.5లకే మధ్యాహ్నం భోజనం, రూ.5లకే రాత్రి భోజనం అందజేసిన విషయం తెలిసిందే. పట్టణంలోని రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఎన్టీఆర్ వైద్యాలయానికి సమీపంలోని కూరగాయల మార్కెట్, కొబ్బరికాయల మార్కెట్ కార్మికులకు ఈ క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడేవి. అలాగే రైల్వేస్టేషన్ వద్ద క్యాంటీన్ రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, బడుగు, బలహీనవర్గాల ప్రజలతో పాటు రైల్వేస్టేషన్‌కు వచ్చి పొరుగు జిల్లాలకు వెళ్లే వ్యవసాయ కూలీలకు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదే ఏడాది ఆగస్టులో ఈ క్యాంటీన్లను నిలిపివేయడంతో పేదలు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండురోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈ రెండు క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్ వద్ద సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్ భవనం



అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్ భవనం

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

వరహానది వద్ద తవ్వి తరలింపు

- గోనె సంచుల్లో నింపి ట్రాక్టర్లలో లోడింగ్
- చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ఎస్.రాయవరం, ఆగస్టు 4:

మండలంలోని సోముదేవుపల్లి గ్రామ సమీపంలో ఉన్న వరహానది వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతు న్నాయి. కొందరు వ్యాపారులు కూలీలతో ఇసుక తవ్వకాలు జరిపించి గోనె సంచుల్లో నింపి అక్కడికి సమీపంలో ఉన్న ఆటోలు, ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్నారు. ఒక్కో బస్తాను రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో చుట్టు పక్కల గ్రామాల్లో డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నారు. పట్టపగలు వరహానది వద్ద తవ్వకాలు జరిపి ఇసుకను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారులకు మామ్మూళ్లు అందడం వల్లే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరహానది వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి ప్రమాదకర గోతులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సోముదేవుపల్లి సమీపంలోని వరహానది వద్ద ఇసుక తవ్వుతున్న దృశ్యం



వరహానది గట్టు పక్కనే నిల్వచేసిన ఇసుక బస్తాలను ఆటోలో లోడ్ చేసిన దృశ్యం (ఫైల్)



బస్తాలతో ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

సోముదేవుపల్లి సమీపంలోని వరహానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. అక్కడ నిఘా పెట్టి అక్రమ తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూస్తాం.

- కుమార్‌స్వామి, డీటీ, ఎస్.రాయవరం మండలం

విషాదం మిగిల్చిన విహారం

- గంభీరం రిజర్వాయర్‌లో పడి విద్యార్థి మృతి
- స్నేహితుల దినోత్సవం రోజున సంఘటన

- వార్త 7వ పేజీలో..

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేయడమే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పోటీలో ఉంటారు

- ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేసి ఈ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలవరం ఎడమ కాలువతో పాటు సుజల స్రవంతి పథకం పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. అనకాపల్లిలో ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున అభ్యర్థి ఎన్నికల బరిలో ఉంటారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం సంతోషకర విషయమన్నారు. కోర్టులో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రధానమంత్రి నెరవేర్చారని తెలిపారు. విశాఖ నుంచి విజయవాడ వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి మంజూరైందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో తుని నుంచి నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, కొత్తవలస వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే జరుగుతోందన్నారు. ఈ పనులు మంజూరైతే తుని నుంచి కొత్తవలస వరకు సమాంతర జాతీయ రహదారి వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సుగమం అవుతుందన్నారు. ఈ ప్రాంత రైతులు పండించిన ఫలసాయాన్ని రైళ్లలో రవాణా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పిస్తామన్నారు. పాయకరావుపేట పరిసరాల్లో తమలపాకు రైతులకు ఇది ఎంతో ఉపయోగమని తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు పార్లమెంట్‌లో ప్రస్తావన తీసుకురాగా రైల్వే శాఖామంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మాడుగుల, చోడవరం పరిసరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం 5 వేల ఎకరాల భూసేకరణ జరపాలని అధికారులను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం


ఘటనా స్థలంలో అప్పలనాయుడు మృతదేహం

నాతవరం, ఆగస్టు 4: నాతవరం మండలం తుని-నర్సీపట్నం రహదారిపై ఎం.బెన్నవరం వద్ద రోడ్డు మలుపులో ఆర్టీసీ బస్సు కొనడంతో బైక్‌పై వెళుతున్న లగుడు అప్పలనాయుడు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఆదివార ఉదయం తన బైక్‌పై నర్సీపట్నం బయలుదేరాడు. ఈ క్రమంలో ఎం.బెన్నవరం మలుపు దగ్గర ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రాణాలు విడిచాడు. మృతుడి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నాతవరం పోలీసులు తెలిపారు.

గెడ్డలో మునిగి ఒకరి మృతి


శ్రీను మృతదేహం

మాకవరపాలెం, ఆగస్టు 4: మండలంలో తూటిపాల, బూరుగుపాలెం గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూటిపాల, బూరుగుపాలెం మధ్యలో ఉన్న గెడ్డలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో వ్యక్తి మృతదేహం ఉందంటూ స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లి పరిశీలించిన పోలీసులు మృతుడు రోలుగుంట మండలం పడాలపాలెం గ్రామానికి చెందిన శ్రీను (40)గా గుర్తించారు. అతడు చేపలు చేపట్టేందుకు గెడ్డకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్గానికి తరలించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


అంజలి (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, ఆగస్టు 4 : మండలంలోని కృష్ణంపాలెం గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇందుకు సంబంధించి సీఐ నరసింగరావు ఆదివారం తెలిపిన వివరాలివి. పరవాడ మండలం పి.బోనంగి గ్రామానికి చెందిన కడవల చిట్టమ్మ కుమార్తె అంజలి (20)ని రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల దుర్గకు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం జరిపారు. వీరికి ఓ కుమార్తె ఉంది. ఆర్థిక సమస్యల కారణంగా ఇటీవల కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. శనివారం సాయంత్రం తన అల్లుడు దుర్గ ఫోన్‌చేసి మీ కుమార్తె ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్టు సమాచారం అందించాడని మృతురాలి తల్లి ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. ఆర్థిక సమస్యలు లేదా భర్త వేధింపులు తన కుమార్తె మృతికి కారణమై ఉండవచ్చునని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందన్నారు.

గిరిజన యువకుడు అదృశ్యంపై అనుమానాలు

- కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద లభించిన కొన్ని వస్తువులు
- ముమ్మరంగా పోలీసుల గాలింపు
- రెండు రోజులైనా లభ్యం కానీ ఆచూకీ


కల్యాణపులోవ రిజర్వాయర్‌లో గాలింపు చేపట్టిన గజ ఈతగాళ్లు (ఇన్‌సెట్‌లో) చిన అప్పారావు (ఫైల్)

రావికమతం, ఆగస్టు 4: రావికమతం మండలం గిరిజన పంచాయతీ చీమలపాడు శివారు దూకులమ్మపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గత రెండు రోజులక్రితం అదృశ్యమయ్యాడు. అయన అచూకి కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆ గిరిజన యువకుడి ఆది వారం వరకూ లభించలేదు. దీనిపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చీమలపాడు పంచాయతీ శివారు దూకులమ్మపాడు గ్రామానికి చెందిన ఈదల చినఅప్పారావు అలియాస్ సంజీవి (35) శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి సోదరి గడ్డమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

కాగా, చినఅప్పారావు చేపల వేటకు తరచూ కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వెళ్లే వాడని తెలియడంలో గాలింపు చర్యలు చేపట్టగా, అక్కడ అతడు వాడే దోనె (నాటు పడవ), తువ్వాలు, కత్తి లభించాయన్నారు. అతడి ఆచూకీ మాత్రం లభించలేదన్నారు. రిజర్వాయర్‌లో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినట్టు చెప్పారు. అతడు చేపల వేట చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ జారి రిజర్వాయర్‌లో పడిపోయాడా? లేదా మరేదైనా జరిగిందా? అనే అనుమానం ఉందన్నారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో, స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందించి, వారి ఆదేశాలనుసారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాగా, చినఅప్పారావు అదృశ్యంపై స్థానికంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఉదయం ఇదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులతో పాటు చినఅప్పారావు కల్యాణపులోవ రిజర్వాయర్ వైపు వెళ్లారని స్థానికులు కొందరు చెబుతున్నారు. వారికీ, చిన్నఅప్పారావుకు మధ్య గతంలో గొడవలు ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో చిన అప్పారావు అదృశ్యం కావడంపై పలు అనుమానాలు ఉన్నాయంటున్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం


పిల్లలతో అరుణ (ఫైల్)

దేవరాపల్లి, ఆగస్టు 4 : మండలంలోని రైవాడ శివారు శ్రీరాంపురంగ్రామానికి చెందిన గేదెల అరుణ(30), తన ఇద్దరి పిల్లలతో అదృశ్యమైంది. ఆమె భర్త అప్పలనాయుడు ఆదివారం రాత్రి దేవరాపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీరాంపురానికి చెందిన అప్పలనాయుడుకి అదే గ్రామానికి చెందిన అరుణతో 2011 లో వివాహమైంది. వారికి మేఘన (9), భార్గవ నాయుడు(6) పిల్లలు ఉన్నారు. ఈ మధ్య భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే భర్త ఆటో తిప్పడానికి వెళ్లగా, అదే సమయంలో అరుణ తన ఇద్దరు పిల్లల్ని వెంట బెట్టుకొని ఇల్లు విడిచి వెళ్లిపోయింది. భర్త అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఇష్టారాజ్యం.. చర్యలు పూజ్యం!

ట్రాఫిక్ నిబంధనలను పాటించని పలువురు వాహనదారులు

- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- సెజ్‌లోని కర్మాగారాల్లో కార్మికులు, ఉద్యోగును విధులకు తీసుకు వెళ్లే బస్సుల డ్రైవర్లలో కొందరు మరీ దారుణం


అచ్యుతాపురంలోని సెజ్ రోడ్డులో పక్క పక్కనే ఇష్టారాజ్యంగా బస్సులు నిలిపిన దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 4: స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లోని కర్మాగారాల్లో కార్మికులు, ఉద్యోగులను ప్రతిరోజూ విధులకు తీసుకు వెళ్లివచ్చే పలు ప్రైవేటు వాహనాల ఆపరేటర్లు నిబంధనలను పట్టించుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రాత్రి వేళల్లో ఎ, బి, సి మూడు షిఫ్టులకు సుమారు రెండు వందలకు పైచిలుకు బస్సులు అచ్యుతాపురం జంక్షన్ మీదుగా సెజ్ కర్మాగారాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ వాహనాల సిబ్బందిలో కొందరు రోడ్డు భద్రతతో పాటు నిబంధనలు అస్సలు పాటించడం లేదని ఈ ప్రాంతానికి చెందిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మితిమీరిన వేగంతో పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సులు నడుపుతుండడం, అలాగే, ముందుగా వెళ్లే వాహనాలను ఇష్టారాజ్యంగా ఓవర్‌టాక్ చెయ్యడం తదితరాలు చేస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా ఇక్కడి కర్మాగారాల్లో అధికంగా మహిళలు పనిచేస్తున్నారు. వీరిని తీసుకు వెళ్లేటప్పుడు ఎంతో జాగ్రత్తగా నడపాలని కానీ కొందరు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనికితోడు కొందరు డ్రైవర్లు ఒకేసారి రోడ్డుపక్కన వాహనాలను నిలిపి వెళ్లిపోతున్నారని అంటున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని చెపుతున్నారు. అయినప్పటికీ ఇటు రవాణా శాఖ అధికారులు కానీ, అటు పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇటువంటి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ఆయా సంస్థల యాజమాన్యాలు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

ప్రమాదం అని తెలిసినా..


ప్రమాదమని తెలిసినా ఆటో డ్రైవర్ సీటుకు ఇరుపక్కలా కూర్చొని పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు

ఎలమంచిలి, ఆగస్టు 4: ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తక్కువే. హెల్మెట్ ధరించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటిస్తూ ప్రయాణిస్తున్నా.. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనదారుల నుంచి ముప్పు తప్పడం లేదు. ఇటుంటి సంఘటనలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఇటువంటి పరిస్థితుల్లో ఇంటి నుంచి వాహనం తీయాలంటేనే పలువురు ఒకటికి పదిసార్లు ఆలోచించుతుంటారు. కానీ కొన్నిచోట్ల మైనర్లకు ఇవేమీ పట్టడం లేదు. ఇంట్లో బండి కనిపిస్తే చాలు కొందరు రోడ్ల పైకి దూసుకు వస్తున్నారు. ఎలమంచిలి పట్టణంలో ఇటీవల కాలంలో పలువురు ఇలాగే వ్యవహరిస్తుండడాన్ని చూసినవారు హడలిపోతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో వారు వాహనాలు నపుతుండడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందని అంటున్నారు. కొన్నిచోట్ల ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురేసి సైతం వెళుతున్నారు. ఇదిలావుంటే, పలువురు ఆటో డ్రైవర్లు సైతం ఇక్కడ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదమని తెలిసినా డ్రైవర్ సీటుకు ఇరుపక్కలా విద్యార్థులను కూర్చోబెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ తరహా ప్రయాణంలో జరగరానికి జరిగితే పరిస్థితి ఏమిటని ఒక్క క్షణం ఆలోచన చేయలేకపోతున్నారు. వెంటనే పోలీసులు అధికారులు స్పందించి వాహనాలు నడపడం వల్ల మైనర్లకు ఎదురయ్యే అనర్థాలపై పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.


కోర్బా రైలు ఏసీ కోచ్‌ల నుంచి దట్టంగా వ్యాపిస్తున్న పొగ


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విశాఖ రైల్వే స్టేషన్‌లో భయం... భయం

... 5వ పేజీ తరువాయి

కమ్మేస్తుండడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. అగ్నిప్రమాదం జరగడంతో పరుగులు తీశారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

బీ-7 కోచ్‌లో లోపంపై సమాచారముందా?

అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌లో సాంకేతిక లోపం ఉందని అధికారులకు ముందస్తు సమాచారముందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ కోచ్‌లో గ్యాస్ సమస్య ఏర్పడి, ఏసీ సరిగా పనిచేయడం లేదని, విశాఖ చేరిన వెంటనే మరమ్మతులకు తరలించాలని అధికారులకు సిబ్బంది ముందస్తు సమాచారమిచ్చారని, దీంతో రైలు విశాఖకు చేరిన వెంటనే బీ-7, బీ-6 కోచ్‌లను సిక్ లైనుకు తరలించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అయితే స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కోచ్‌లను గంటల తరబడి ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేయడంతోనే ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు. ర్యాక్‌కు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం జరగదని, నిర్వహణ కోసం కోచింగ్ కాంప్లెక్సుకు తరలించే సమయంలో సిక్ కోచ్‌లుగా గుర్తించిన (బీ-7, బీ-6) తొలగించవచ్చుననే ధీమాయే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. అధికారులు ఈ అంశాన్ని సమీక్షించి ఏసీ టెక్నీషియన్‌ను ప్రాథమికంగా విచారించారని సమాచారం.

యథావిధిగా రైళ్ల రాకపోకలు

నాల్గో నంబరు ప్లాట్‌ఫాంపై నిలిచి ఉన్న కోర్బా ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లలో జరిగిన అగ్ని ప్రమాదం ప్రభావం రైళ్ల రాకపోకలు పడలేదు. అగ్నిమాపక దళం మంటలను అదుపుచేసిన తర్వాత ర్యాక్‌ను నిర్వహణ నిమిత్తం కోచింగ్ కాంప్లెక్సుకు, దగ్ధమైన కోచ్‌లను యార్డుకు తరలించారు. కోర్బా ఎక్స్‌ప్రెస్ ర్యాక్‌ను విశాఖ నుంచి వయా తిరుపతి మీదుగా కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు (17488) వినియోగించాల్సిన నేపథ్యంలో నిర్వహణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతోపాటు దగ్ధమైన ఏసీ కోచ్‌ల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ కోచ్‌లలో ముందస్తు రిజర్వేషన్ పొందిన ప్రయాణికులు ఖరారైన బెర్తులలో ప్రయాణించారు. ఈ రైలు ఆదివారం నిర్దేత సమయానికే విశాఖ నుంచి బయలుదేరింది.

స్మోక్ సెన్సార్లు పనిచేస్తున్నాయా?

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోర్బా ఎక్స్‌ప్రెస్ నుంచి విడదీసి నాలుగో నంబరు ప్లాట్‌ఫామ్‌పై పెట్టిన కోచ్‌లలో దట్టమైన పొగలు వచ్చాక, మంటలు కూడా వ్యాపించాకే అంతా అప్రమత్తమయ్యారు. మొదట బీ-7 కోచ్ నుంచే పొగ, మంటలు వచ్చాయి. ఆ తరువాత అవి బీ-5, బీ-6 కోచ్‌లకు వ్యాపించాయి. సాధారణంగా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. వారితో పాటు ప్లాట్‌ఫారాలపై వ్యాపారాలు చేసుకునే వారు తిరుగుతూ ఉంటారు. అయితే ఎవరూ పొగలు రావడాన్ని గమనించలేదు. మంటలు కూడా వ్యాపించాకే అంతా అప్రమత్తమయ్యారు. ఇటీవల రైల్వే శాఖ కొన్ని మార్పులు చేసింది. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అన్నింటిలో స్మోక్ సెన్సార్లు ఏర్పాటు చేసింది. కోచ్‌లో ఎక్కడ పొగ వచ్చినా వెంటనే అలారం మోగుతుంది. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగితే రైలు ఆగిపోతుంది. ఆ తరువాత సహాయక చర్యలు మొదలవుతాయి. అదే వందేభారత్ రైళ్లు అయితే ఏ కోచ్‌లో పొగ వచ్చినాదానిని సెన్సార్లు పసిగట్టిన వెంటనే ఆటోమేటిక్‌గా బ్రేకులు అప్లయ్ అవుతాయి. పైలట్‌కి అలెర్ట్ వెళుతుంది.

అయితే ప్రమాదానికి గురైన బీఎస్-7 కోచ్‌లో కూడా స్మోక్ సెన్సార్లున్నాయి. అవి ఎందుకు పనిచేయలేదు. అలారం ఎందుకు మోగించలేదు అనే అనుమానాలు రేగుతున్నాయి. ఇంజిన్ నుంచి విడదీసిన కోచ్‌లు కావడంతో వాటికి విద్యుత్ సరఫరా లేదని, అందుకే అలారం మోగలేదని రైల్వే అధికారులు చెబుతున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు బీ-7 కోచ్‌లోని బాత్రూమ్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనిని రైల్వే అధికారులు అంగీకరించడం లేదు. తాము విచారణ చేశాకే కారణాలు వెల్లడిస్తామంటున్నారు. ప్రతి కోచ్‌లో బ్యాటరీలు కూడా ఉంటాయని, వాటి వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చునని అంటున్నారు. అలాగైతే సెన్సార్లు కూడా పనిచేయాలి కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఈ ఘటన రైల్వే అధికారులకు కొత్త సవాల్ విసిరింది. నిలిపి ఉంచిన కోచ్‌లో స్టేషన్‌లోనే అగ్నిప్రమాదం జరగడం, స్మోక్ సెన్సార్లు ఉన్నా అప్రమత్తం చేయకపోవడం లోపాలుగా కనిపిస్తున్నాయి.

నేడు విచారణ

ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై విచారణ కమిటీని వేశారు. క్లూస్ టీమ్, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ అధికారులు, రీసెర్చి డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ అధికారులు విశాఖపట్నం వస్తున్నారు. వారు పూర్తిగా దగ్ధమైన బీ-7 కోచ్‌ను పరిశీలించి ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై నివేదిక ఇస్తారు.

4వ నంబరు ప్లాట్‌ఫారానికి ఏమైంది?

... 5వ పేజీ తరువాయి

సరఫరా లేని కోచ్‌లో ప్రమాదం జరగడంపై అనుమానాలు కలుగుతున్నాయి. లాక్ చేసిన కోచ్‌లోకి ఎవరూ వెళ్లే అవకాశం లేదు. ఏసీ కోచ్ కావడంతో లోపలికి సిగరెట్, అగ్గిపుల్ల లాంటివి వేసే అవకాశం లేదు. మరి పొగ ఎలా వచ్చింది? మంటలు ఎలా వ్యాపించాయనే దానిపై అనుమానాలున్నాయి. కేవలం నాలుగు నెలల కాలంలో రెండు మేజర్ ప్రమాదాలు జరగడంతో విశాఖ స్టేషన్‌లో భద్రతాపరమైన చర్యలు మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది. నిర్వహణ పనులు తూతూ మంత్రంగా చేయడం, తనిఖీలు సక్రమంగా జరగకకపోవడం వల్లే ఈ ఘటనలు జరిగాయని భావిస్తున్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి


అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేష్, బీటెక్ రవి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య రోజున అమ్మవారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందనే భావంతో విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. బాలాలయంలో అమ్మవారికి తెల్లవారుజామున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కాటేజీలతో పాటు పరిసర ప్రాంతాల్లోని తోటల్లో పలువురు భక్తులు వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం బాలాలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే, అమ్మవారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ విశాఖజిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్‌లు దర్శించుకున్నారు.

విషాదం మిగిల్చిన విహారం

- గంభీరం రిజర్వాయర్‌లో పడి విద్యార్థి మృతి
- స్నేహితుల దినోత్సవం రోజున సంఘటన


నిరంజన్ (ఫైల్ ఫొటో)

ఆనందపురం, ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవం రోజున విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు గంభీరం రిజర్వాయర్ వద్దకు వెళ్లిన ముగ్గురు మిత్రుల్లో ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన డోకి నిరంజన్ (20), విశాఖకు చెందిన జె.యశ్వంత్, బి.ఆశిష్, హైదరాబాద్‌కు చెందిన రెహన్, తాడేపల్లిగూడేనికి చెందిన లలిత్ విశాఖలోని గీతం కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. స్నేహితుల దినోత్సవం కావడంతో సరదాగా గడిపేందుకు ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో గంభీరం రిజర్వాయర్‌కు చేరుకున్నారు. సరదాగా గడుపుతుండగా డోకి నిరంజన్ సెల్ఫీ తీయడానికి ప్రయత్నించి ఒక్కసారిగా కాలుజారి రిజర్వాయర్‌లో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు జె.యశ్వంత్, బి.ఆశిష్ నీటిలో దూకారు. అయితే ముగ్గురికీ సరిగా ఈత రాకపోవడంతో నీట మునిగిపోతుండగా, స్థానికులు గమనించి రిజర్వాయర్‌లోకి దూకి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే యశ్వంత్, ఆశిష్‌లను సురక్షితంగా బయటకు తీసినా, నిరంజన్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బలగాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి, మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ఘనంగా సాయియువ స్వర సమ్మేళనం



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 4: శ్రీసత్యసాయిబాబా సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన విద్య వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడమే కాకుండా తాగునీరు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆదివారం బలిఘట్టం పాకలపాటి గురుదేవుల ఆశ్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయి యువ స్వరం జిల్లా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబాకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఉన్నారన్నారు. విదేశాల నుంచి వైద్యులను రప్పించి పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సేవలు అందించారన్నారు. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు జిల్లాలో ఉండటం బాధాకరమని అన్నారు. చిన్న పిల్లలను గంజాయి అక్రమ రవాణాలో వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయికి అలవాటు పడి జీవితాలు పాడు చేసుకుంటురన్నారు. గ్రామాలలో చిన్న పిల్లలు మదుం మీద కుర్చొని బహిరంగంగా మద్యం తాగుతున్న ఉదంతాలు కలచి వేస్తున్నాయన్నారు. పెడత్రోవ పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించడానికి సత్యసాయి సేవా సంస్థ ద్వారా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహ సేవాదళ్ సమన్వయకర్త డి.రాఘవరావు, జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర యువ సమన్వయ కర్త విశ్వనాథ కల్యాణ్, రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ రేపు

- రిటర్నింగ్ అధికారిగా విశాఖ జేసీ
- సహాయ రిటర్నింగ్ అధికారులుగా డీఆర్వోలు
- మొత్తం ఓటర్లు 838 మంది

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు ఈ నెల ఆరో తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న నామినేషన్ల పరిశీలన, 16న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. కాగా ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తారు. ఈ ఎన్నికల్లో మొత్తం 838 మంది ఓటర్లున్నారని అధికారులు తాజాగా లెక్కించారు.

ఓటర్లు వీరే...

ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మంది జడ్పీటీసీ సభ్యుల్లో 36 మంది (ఇద్దరు మృతిచెందగా, ఒకరు రాజీనామా చేశారు), 652 మంది ఎంపీటీసీ సభ్యుల్లో వివిధ కారణాలతో 16 ఖాళీలు ఏర్పడగా 636 మంది, జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లలో 97 మంది (ఒకరు పదవికి రాజీనామా చేశారు), నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది, ఎలమంచిలి మునిసిపాలిటీలో 25మంది కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా జీవీఎంసీ పరిధిలో విశాఖ, అనకాపల్లి ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డితో పాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పి.విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, నర్సీపట్నం మునిసిపాలిటీలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, వండుల రవీంద్రబాబు, వేపాడ చిరంజీవిరావు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటింగ్‌కు విశాఖ, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గత నెల 31వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

AJC CLASSIFIEDS

ASTROLOGY

★ శ్రీ సాయి రాఘవేంద్రస్వామి జ్యోతిషాలయం : విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఆరోగ్యం, స్త్రీ పురుష వశీకరణ, ప్రేమ, పెళ్ళి, భార్యాభర్తల గొడవలు, ఏ A to Z వ్యక్తిగత సమస్యల శాశ్వత పరిష్కారానికి సంప్రదించండి. వి.రామచంద్రశాస్త్రి, పాతగాజువాక. సంప్రదించు: 9963273023.
AJV_192578

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k.
Phone : 8977639662 / 8977639663 AJH-4211

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వాడనర్సాపురంలో సమస్యలపై వినతి



ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న కూటమి నాయకులు

అచ్యుతాపురం, ఆగస్టు 4 : వాడనర్సాపురంలో సమస్యలు పరిష్కరించాలంటూ ఆ పంచాయతీకి చెందిన కూటమి సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరారు. ఈ మేరకు అచ్యుతాపురంలో ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఎస్‌ఏవోటీ, పైడమ్మ చెరువు తదితర సమస్యలు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య మాజీ ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి దేముడు, కొవిరి సోమేష్, చోడిపల్లి ప్రసాద్, రమణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : టైలర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎలమంచిలి మండల టైలరింగ్ సొసైటీ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు అతిరిపశెట్టి సత్యనారాయణ, దుప్పట్ల శేషుబాబు, మళ్ల శ్రీనివాస్, కారుకొండ భద్రరావు, డి.వెంకటరావు, పి.సత్తిబాబు, పసగడుగుల రమణలు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో శ్రమదానం



కాలనీ ఆవరణలో తుప్పలను తొలగిస్తున్న యువకులు

ఎలమంచిలి, ఆగస్టు 4 : మునిసిపాలిటీ పరిధి శ్రీరామ్‌నగర్‌లోని టిడ్కో గృహ సముదాయంలో గల కాలనీవాసులు ఆదివారం శ్రమదానం చేపట్టారు. ఇంటికి ఒకరు చొప్పున వారికి ఒకరోజు శ్రమదానం చేసి, తద్వారా ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అంతా కలిసి పిచ్చి తుప్పలను తొలగించి, కాల్వలను శుభ్రపర్చుకున్నారు. ప్రతి వారం ఇలా శ్రమదానం చేస్తామని కాలనీ సంఘం ప్రతినిధులు ప్రసాద్, హైరామ్ తదితరులు తెలిపారు.

ఆదుకోవాలంటూ భవన నిర్మాణ కార్మికులు ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు భద్రం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇక్కడ భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు, పథకాలను పూర్తిగా నిలుపుదల చేసి బోర్డులో ఉన్న కార్మికుల నిధులను మళ్లించి అన్యాయం చేసిందని వాపోయారు. సుమారు ఏడేళ్లుగా చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. మహిళా కార్మికులకు అందాల్సిన ప్రసూతి ఖర్చులు, పిల్లల వివాహ కానుకలు నిలిపివేశారన్నారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా నాయకులు మొల్లేటి ఈశ్వరరావు, మద్దాల నూకేష్, చిన్ని సత్తిబాబు, ఏఐటీయూసీ నాయకులు శ్రీరామదాసు అబ్బులు, తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేయడమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కోరినట్టు ఆయన చెప్పారు. అనకాపల్లికి పోలవరం నీరు తీసుకొచ్చి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. దీనికి అవసరమైన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఒకటి, రెండేళ్లలో ఈ ప్రాంతానికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు వస్తాయని తెలిపారు. జిల్లాలో హైడ్రోజన్ కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సానుకూలంగా ఉన్నారన్నారు. ఫర్నిచర్ తయారీ క్లస్టర్ ఏర్పాటు చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల వర్షాలకు జిల్లాలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ప్యాచ్ వర్క్‌లను తక్షణమే చేయాలని ఆదేశించామని చెప్పారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.400 కోట్లు గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం వల్లే జిల్లాలో రోడ్లు ఈ దుస్థితికి చేరాయని, కూటమి ప్రభుత్వం రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఆలోచన చేస్తున్నదని, త్వరలోనే రోడ్లు బాగుపడతాయని తెలిపారు. జాతీయ రహదారిపై వర్షాలకు దెబ్బతిన్న చోట ప్యాచ్ వర్కులను పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. కాగా రానున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పోటీలో ఉంటారని సీఎం రమేశ్ స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థి ఎవరనేది సీఎం చంద్రబాబు త్వరలోనే ప్రకటిస్తారన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, బీజేపీ, జనసేన నాయకులతో ఇప్పటికే చర్చించారని చెప్పారు. కూటమి తరఫున ఎమ్మెల్సీగా పోటీ చేసే అభ్యర్థిని అంతా కలిసి గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో కలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు



శ్రీనివాస్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న మిత్రమా కుశలమా సభ్యులు

వాడవాడలా వెల్లివిరిసిన స్నేహం

- ఘనంగా స్నేహితుల దినోత్సవం
- పలుచోట్ల వేడుకలు, సామాజిక కార్యక్రమాలు
- మరికొన్నిచోట్ల పూర్వ విద్యార్థుల కలయిక



బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో లాంగ్‌వాక్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : స్నేహితుల దినోత్సవాన్ని పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో రింగురోడ్డు జంక్షన్ నుంచి లాంగ్‌వాక్ పోటీలను నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నరసింగరావు, చైర్మన్ పీఎస్ అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, పెంటకోట ప్రభాకర్, కోశాధికారి బి. శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. జార్జి క్లబ్‌లో షటిల్ హట్ ఆధ్వర్యంలో స్నేహదినోత్సవాన్ని జరుపుకున్నారు. డాక్టర్ విష్ణుమూర్తి, కొణతాల మురళీకృష్ణ, జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, వి.చంద్రశేఖర్, క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా సత్యనారాయణస్వామి కొండ వద్ద మిత్రమా కుశలమా సినిమా సంస్థ ఆధ్వర్యంలో 1985-86 పదో తరగతి బ్యాచ్ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. తమ మిత్రుడైన ఎ.శ్రీనివాస్ కిడ్నీ వ్యాధితో మృతిచెందడంతో సంస్థ తరఫున రూ.లక్ష చెక్కును అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పీఎల్ నారాయణ, కోశాధికారి పలకా నాగేశ్వరరావుల బృందం ఆయన కుటుంబానికి అందజేశారు. అలాగే, తోటాడ రోడ్డులోని ఒక లేఅవుట్‌లో గవరపాలెం ఉన్నత పాఠశాల 1991-92 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కొవిడ్ సమయంలో తమ మిత్రుడు దొడ్డి ఉమా మృతి చెందడంతో వారి కుమార్తెలకు రూ.50 వేలను విల్లూరి పరమేశ్వరరావు ద్వారా అందించినట్టు కర్రి గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగన్నాథరావు, కొణతాల అప్పలరాజు, పీలా రాముడు, పెంటకోట బలరాం తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : స్నేహితుల దినోత్సవం సందర్భంగా కోటవురట్లకు చెందిన కొందరు యువకులు మండలంలోని కైలాసపట్నంలో గల గిరిజన చిన్నారుల అనాథ ఆశ్రమంలో గల తొంభై మందికి భోజనాలను ఏర్పాటు చేశారు. వెంకటరమణ, శ్రీరాజ్, దుర్గా శ్రీను, శివ, గణేష్ కుమార్ తదితరులతో ఆశ్రమం నిర్వాహకుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు



కైలాసపట్నం ఆశ్రమంలో పిల్లలు భోజనాలు ఏర్పాటుచేసిన స్నేహితులు

ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : మోటార్ వాహన చట్టం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఆవరణలోని నాగదుర్గమ్మ ఆలయం వద్ద పట్టణంలోని ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్య సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. వీటివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. మారిన నిబంధనల ప్రకారం మద్యం సేవించి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఇష్టానుసారంగా రోడ్లపై ఆటోలు నిలపకుండా, పార్కులోనే ఆపాలన్నారు. ట్రాఫిక్ ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు స్టాక్ పాయింట్‌లో అగ్ని ప్రమాదం

- భారీగా పీచు దగ్ధం
- రూ.25 లక్షల వరకు నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే జరిగి ఉంటుందని అనుమానం



కొబ్బరి పీచుకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాంబిల్లి, ఆగస్టు 4: మండల కేంద్రం రాంబిల్లిలో గల 'రాధాస్వామి ఫైబర్స్' సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొబ్బరి పీచు పరిశ్రమకు చెందిన పీచును ఇక్కడ స్టాక్ చేస్తుంటారు. ఆదివారం ఉదయాన్నే ఒక్కసారిగా ఇక్కడ మంటలు చెలరేగడంతో గుర్తించినవారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి తీవ్రంగా శ్రమించినప్పటికీ అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. పెద్ద ఎత్తున మంటలతో పాటు పొగ వ్యాపించడంతో పరిసరాల వారు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ఘటన జరిగి ఉంటుందని పీచు పరిశ్రమ యజమాని కిశోర్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రమాదంలో సుమారు 25 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'కొయిలాడ' నవలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రామ్మోహనరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4: ఉగాది నవలల పోటీల్లో అనకాపల్లికి చెందిన కొయిలాడ రామ్మోహనరావు రాసిన 'ఎదురులేని ఏడు' నవలకు అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన వేడుకల్లో ఈ మేరకు అవార్డుతో పాటు రూ.10 వేలను ప్రముఖ సినీ దర్శకుడు దేవ కట్ట, ప్రముఖ రచయిత మధురాంతకం చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకులు వంశీ, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి హాజరైనట్టు చెప్పారు. గత ఏడాది నిర్వహించిన పోటీలకు 180కి పైగా నవలలు రాగా, వాటిలో 25 ఎంపిక చేశారన్నారు. అందుకే ఇంత సమయం పట్టిందని వివరించారు.

మునగపాక మండల సర్పంచ్‌ల సంఘం ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక (అనకాపల్లిటౌన్), ఆగస్టు 4 : మండల సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా కాండ్రేగుల నూకరాజు, ఉపాధ్యక్షులుగా చదరం గణేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సుందరపు తాతాజీ, కార్యదర్శిగా అయినంపూడి భాస్కరరాజు, సహాయ కార్యదర్శులుగా కోరుకొండ వెంకటి, భీశెట్టి గంగఅప్పలనాయుడు, కోశాధికారిగా దిమ్మల అప్పారావు, సభ్యులుగా పాలిపిని రమణమ్మ, హేమలత ఎన్నికయ్యారు. వీరిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సత్కరించారు.


ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో భారీ వృక్షం కొమ్మలు నరికివేత

విచారణకు రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు



ఎలమంచిలి, ఆగస్టు 4 : పట్టణ సమీపంలోని రోడ్లు భవనాల శాఖకు చెందిన అతిథి గృహం ఆవరణలో ఉన్న భారీ వృక్షానికి చెందిన సగానికి పైగా కొమమ్మలను కొందరు శనివారం నరికివేశారు. కోర్టుకు వెళ్లే రహదారి పక్కన ఎందరికో ఇది నీడనిచ్చేది. ఆర్ఐ అక్కడకు చేరుకుని నరికి కొమ్మలను యథాస్థానంలోనే ఉంచాలన్నారు. దీనిపై సోమవారం విచారణ జరపనున్నట్టు చెప్పారు.

25 నుంచి కృష్ణాష్టమి వేడుకలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : ఇక్కడి జాతీయ రహదారిలోని హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం జగన్నాథస్వామి మందిరం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 25నుంచి 27వ తేదీ వరకు ఈ వేడుకలను జరపనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు డి.కృష్ణ ప్రేమదాసు తెలిపారు.

టెన్త్, ఇంటర్‌లో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస పట్నాయక్

పాయకరావుపేట, ఆగస్టు 4 : టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ చూపిన శిష్టకరణాల సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్టు ఆలిండియా శిష్టకరణాల అసోసియేషన్ అధ్యక్షులు డీవీ కృష్ణారావు తెలిపారు. పట్టణంలో ఆదివారం తుని, పాయకరావుపేట శిష్టకరణాల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన ఇరవై మంది విద్యార్థులకు రూ.10,000లు చొప్పున స్కాలర్‌షిప్‌లతో పాటు అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

- ఆ తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి
- యూటీఎఫ్ ప్రతినిధి చినబ్బాయి



సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన సదరు జీవో వల్ల ప్రభుత్వ పాఠశాలలు దివాళా తీశాయన్నారు. అందువల్ల ఆ జీవోను రద్దు చేసి, పాత జీవో 53 ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెగా డీఎస్సీలో పోస్టులు భర్తీ చేయడానికి కూడా జీవో 117 ఆటంకమన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో తరగతులు నిర్వహించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను రక్షించి, విద్యను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయిత్రి, జిల్లా కార్యదర్శులు డి.శ్రీను, జీఎస్ ప్రకాష్, కోశాధికారి జోగా రాజేష్, పలు మండలాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

కొణతాలను కలిసిన స్టాండింగ్ కమిటీ అభ్యర్థులు



కొణతాలతో స్టాండింగ్ కమిటీ అభ్యర్థులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : పట్టణంలోని రింగురోడ్డులో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ కూటమి అభ్యర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆశీస్సులు పొందారు.

నేటి నుంచి గవరపాలెంలో హరికథా గానం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం నుంచి హరికథా గానం జరగనుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరుపతికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కళాకారిణి విజయకుమారి భాగవతారిణిచే సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు మహాభారతంపై హరికథా గానం ఉంటుందన్నారు.

సేవా కార్యక్రమాలే 'రోటరీ' లక్ష్యం



సమావేశాన్ని ప్రారంభిస్తున్న కో-ఆర్డినేటర్ దీపక్‌పురత్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : సేవా కార్యక్రమాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని రోటరీ కో-ఆర్డినేటర్ పీడీజీ దీపక్‌పురత్ అన్నారు. రింగురోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్లబ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ సభ్యుల సంఖ్యను పెంచినట్లయితే సేవా కార్యక్రమాలు మరింత చురుగ్గా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రోటరీ ప్రతినిధులు ఎం.వీరభద్రారెడ్డి, ఏవీ రంగారావు, బుద్ద రమణాజీ, కె.సతీష్, ఎస్.రాజేష్, డి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో 300 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ, ఆగస్టు 4 : వెన్నెలపాలెంలో ఆదివారం ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఓనస్ ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటైన ఈ శిబిరాలను తొలుత మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. 300 మంది వైద్య సేవలు పొందగా, 82 మంది రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎంపీటీసీ పైలా రథాల సన్యాసిరావు, పైలా వరలక్ష్మి, లోకిరెడ్డి అభి సన్యాసినాయుడు, వెన్నెల గిరి, గొంప మారునాయుడు, పైలా ప్రసాద్, బోజంకి అప్పలనాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పొలం పనులపై అవగాహన



పొలం పనులను వివరిస్తున్న గణిత క్లబ్ సభ్యులు

కశింకోట (అనకాపల్లి టౌన్), ఆగస్టు 4 : మండలంలోని వెదురుపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం శకుంతలాదేవి గణిత క్లబ్ ఆధ్వర్యంలో పొలం పనులపై అవగాహన కల్పించారు. విద్యార్థులను పొలాల్లోకి తీసుకువెళ్లి వ్యవసాయ భూముల వైశాల్యం, చుట్టు కొలతలు, చదరపు అడుగు, చదరపు గజం, సెంటు మధ్య సంబంధాన్ని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దుర్గాప్రసాద్, పావని పరమేశ్వరి వివరించారు.

నేవీ బాక్సింగ్ ట్రైల్‌కి ప్రశాంతి విద్యార్థి ఎంపిక



ఎంపికైన ధనుష్


అచ్యుతాపురం, ఆగస్టు 4 : ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎన్‌సీసీ కేడెట్ అనగాని ధనుష్ ఇండియన్ నేవీ చీఫ్ పెట్టీ ఆఫీసర్‌కు బాక్సింగ్ కోటాలో జరిగే ట్రైల్స్‌కి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. ఈనెల 13న ముంబయిలోని ఐఎన్ఎస్ హంలాలో జరిగే ఈపోటీల్లో ధనుష్ ప్రతిభ కనబరిస్తే ఇండియన్ నేవీలో నేరుగా ఉద్యోగం పొందే అవకాశం ఉందని వివరించారు. ఉమ్మడి విశాఖ గ్రూప్ నుంచి ధనుష్ ఎంపిక కావడం పట్ల ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 4 : పట్టణంలో రెండు రోజులు పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగ పరిమితి వయసు పెంచడం తగదన్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేయాలన్నారు. సమావేశం అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగామామిడి రమణ, జి.గీతాకృష్ణ, సభ్యులుగా కేశవ, శ్రీను, వెంకటేష్, కృపానంద్, దివాకర్, జనార్థన్ తదితరులు ఎన్నికయ్యారు.

నేడు 'పేటలో' ఐదు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, ఆగస్టు 4 : పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో గల తాండవ షుగర్స్, చక్కానగర్ ఫీడర్ల పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి
విలేఖరులు కావలెను
● అనకాపల్లి అర్బన్ ● అనకాపల్లి నెహ్రూ చౌక్
● మునగపాక ● కశింకోట ● ఎలమంచిలి రూరల్
● నర్సీపట్నం టౌన్ ● చోడవరం టౌన్
.. పైన పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు విలేఖరులు కావలెను.
అభ్యర్థులు డిగ్రీ/ఇంటర్ చదివి ఉండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి.
ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8-8-2024 (గురువారం) ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను.
అడ్రస్ : ఆంధ్రజ్యోతి కార్యాలయం
పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం. ఫోన్ : 2549123

వర్షాధార ప్రాంతాల్లో వరినాట్లు కష్టమే?

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వర్షాలు ఆశాజనకంగా పడడంతో వరినాట్లు వేసేందుకు రైతులు దమ్ములు చేస్తున్నారు. అయితే మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఇప్పటికీ వ్యవసాయ పనులు చేపట్టని దుస్థితి నెలకొంది. జలాశయాల ఆధారం లేని ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా.. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వర్షాభావ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు
- ఇంకా మొదలుకాని దమ్ములు
- ఎండిపోతున్న నారుమడులు
- తీవ్ర ఆవేదనలో రైతులు


దేవరాపల్లి : నాగయ్యపేటలో నాట్లు చేపట్టకపోవడంతో ఉండిపోయిన నారుమడి


దేవరాపల్లి : చుక్క నీరు కానరాని సన్యాసి చెరువు

దేవరాపల్లి, ఆగస్టు 4 : మండలంలో వర్షాధారంపై ఆధార పడిన గ్రామాల్లో వరినాట్లు వేయలేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. సాధారణంగా జూలైలో వరి నాట్లు వేస్తారు. ప్రస్తుతం ఆగస్టు వచ్చినా దమ్ములు చేసే అవకాశం లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పదేళ్లలో ఈ పరిస్థితి లేదని చెబుతున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాలు కురవడంతో జలాశయాలు నిండా యని, అయితే తమకు జల వనరుల లభ్యత లేకపోవడంతో వర్షంపైనే ఆధార పడతామన్నారు. కానీ తమ ప్రాంతంలో వ్యవసాయ పనులు చేపట్టే రీతిలో వర్షాలు పడకపోవడంతో ఇప్పటి వరకూ వరినాట్లుకు సంబంధించిన పనులు చేపట్టలేదని ఉసూరుమంటున్నారు. వర్షాలు లేకపోవడంతో నారుమడులు బతికించడానికి నానాపాట్లు పడ్డామని, కానీ వర్షాలు లేకపోవడంతో వరినాట్లు వేయలేక పోతున్నామన్నారు. మండలంలో సుమారు 50 వరకు చెరువులు ఉండగా, వాటిల్లో కనీసం పశువులు కడగడానికి కూడా నీరు లేని దుస్థితి నెలకొందంటూ రైతులు వాపోతున్నారు. నాగయ్యపేట, సీతంపేట, రైవాడ, వెంకటరాజపురం, తెనుగుపూడి, వాకపల్లి, గర్నింగి, శ్రీరాంపురం పంచాయతీలతో పాటు గిరిజన పంచాయతీలు తామరబ్బ, చింతలపూడి, వాలాబు పంచాయతీల్లో ఈ పరిస్థి నెలకొంది.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : రైవాడ జలాశయ కాలువ పరిధిలోని గ్రామాల్లో జోరుగా వరినాట్లు కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలు అరకొరగా మాత్రమే ఉండడంతో రైవాడ జలాశయ పరిధిలో లేని గ్రామాల్లో మాత్రం నేటికీ వరి నాట్లు ప్రారంభం కాలేదు. ఎక్కడో నీటి సదుపాయం, విద్యుత్ మోటార్‌లో ఉన్న చోట మాత్రమే వరినాట్లు జరుగుతున్నాయి. మండలంలోని మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం, ఏ.భీమవరం, వారాడ, వి.సంతపాలెం, ఏ.కోడూరు తదితర రైవాడ జలాశయ కాలువ పరిధిలోని గ్రామాల్లో మాత్రం వరి నాట్లు ఊపందుకున్నాయి.

మరోవైపు దమ్ములు జోరుగా జరుగుతున్న ప్రాంతాల్లో కూలీల కొరత వేధిస్తోంది. దీంతో అధిక కూలి రేట్లు డిమాండ్ చేస్తున్నారు. ఇది రైతులకు ఆర్థిక భారంగా మారుతోంది. వ్యవసాయ పనులు ఉపాధి హామీ కూలీలతో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నమ్మకం పోతోంది



వర్షాలు లేకపోవడంతో వరిమడులు వేసిన నుంచి ఇబ్బంది పడుతూనే ఉన్నాం. కనీసం వరినారు బతికించుకుంటే, ఆ తర్వాత వానలు పడితే దమ్ములు చేసి వరినాట్లు వేయాలని ఎంతో ఆశపడ్డాం. కానీ వరుణుడు కరుణించలేదు. కేవలం వర్షాధారంపై ఆధారపడే తమ ప్రాంతాల్లో ఈ ఏడాది వరినాట్లు వేస్తామన్న నమ్మకం లేకుండా పోతోంది. ఆకాశం వైపు చూస్తున్నాం. అంతకుమించి ఏం చేయాలో అర్థం కావడం లేదు.

\- ఆదిరెడ్డి చినసూర్యనారాయణ, నాగయ్యపేట

ఘనంగా నూకాలమ్మ అమ్మవారి పండుగ


నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న అయ్యన్న, పలువులు నేతలు

గొలుగొండ, ఆగస్టు 4 : మండలంలోని గొలుగొండలో ఆదివారం ఘనంగా నూకాలమ్మ అమ్మవారి పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పుర వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జీ, కమురవోలు చిట్టిబాబు, పి.నాగేశ్వరరావు, స్థానికులు పుల్లేటికుర్తి రమేష్, గండేపల్లి రాము, పి.చెల్లారావు, లోవతదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీస్ కార్యకర్తల సంబరాలు


జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సంబరాలు

రోలుగుంట, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మండల మాదిగ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఉన్న బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్య క్రమంలో సమితి మండల అధ్యక్షుడు శివ మాదిగ, నేతలు పులగుజ్జుల వెంకటరమణ, పులగుజ్జుల రాజు, అప్పారావు, కొండబాబు, కోడి అప్పారావు, మరియమ్మ, రమణమ్మ, నూకరత్నం పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



మారథాన్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 4 : డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆయన ఆదివారం ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలనపై అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2.5 రన్ మారథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. రన్ మారథాన్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు ప్రోత్సహకాలు, మరో పది మందికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.ఈశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సంస్థ సభ్యులు దొండా నరేష్, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొండా నారాయణమూర్తి, వినోద్ బాబు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, దొండా గిరిబాబు, జి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచౌడేశ్వరి అమ్మవారి పూజలు



నర్సీపట్నం, ఆగస్టు 4 : బలిఘట్టం ఉత్తరవాహిని తీరంలో శ్రీగౌరీశంకర దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి జన్మదిన నక్షత్రం సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆషాడ మాసంలో చివరి వారం అమావాస్య రోజున అమ్మవారి పుట్టిన రోజు జరుపుతారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెన్న నెహ్రూ, ఉపాధ్యక్షుడు బూడిద గంగబాబు, కార్యదర్శి జెట్టి శంకరావు, కోశాధికారి సాంబశివ మాస్టారు, చందన ఉమా తదితరులు పాల్గొన్నారు.


సారె తీసుకెళ్తున్న భక్తులు

నాతవరం : మండల కేంద్రంలో ఆదివారం శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి. శ్రీశక్తి పంచాయతన ఆలయ ప్రాంగణంలో ఉన్న చౌడేశ్వరిదేవికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. యర్రా కాశీ ఆధ్వర్యంలో మహిళలు సారెను ఊరేగింపుగా చౌడేశ్వరిదేవి ఆలయానికి తీసుకెళ్ళారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న అమ్మవారు

మాడుగుల, ఆగస్టు 4 : స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మోదకొండమ్మను అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జాము ఆరు గంటల నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు.

ఆంధ్రజ్యోతి

విలేఖరులు కావలెను

● అనకాపల్లి అర్బన్ ● అనకాపల్లి నెహ్రూ చౌక్
● మునగపాక ● కశింకోట ● ఎలమంచిలి రూరల్
● నర్సీపట్నం టౌన్ ● చోడవరం టౌన్

.. పైన పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు విలేఖరులు కావలెను.

అభ్యర్థులు డిగ్రీ/ఇంటర్ చదివి ఉండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు **8-8-2024 (గురువారం)** ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

అడ్రస్: **ఆంధ్రజ్యోతి కార్యాలయం**
పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్-16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం. ఫోన్ : 2549123

ఏఎల్‌పురం పీహెచ్‌సీ సందర్శించిన స్పీకర్ అయ్యన్న


ఉపాధి హామీ కూలిలతో మాట్లాడుతున్న అయ్యన్న

కృష్ణాదేవిపేట, ఆగస్టు 4 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం మరిడిమాంబ నూతన ఆలయం వద్ద ఆదివారం మాజీ జడ్పీటీసీ సీహెచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముందుగా మరిడిమాంబ అమ్మవారి దర్శించుకున్నారు. టీడీపీ శ్రేణులతో కలిసి కాసేపు ముచ్చటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరం స్టాళ్లను సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలపై వైద్యాధికారి గాయత్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలంటూ విన్నవించారు. అయ్యన్నను ఉపాధి హామీ కూలీలు కలిసి తమకు నెల రోజులుగా కూలి ఇవ్వడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, మాజీ సర్పంచ్ అప్పారావు, టీడీపీ సీనియర్ నాయకులు బొడ్డు జమీలు, చిట్టిబాబు, లగుడు రమేష్, అప్పల నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వినతి..

నర్సీపట్నం : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా ఆరోగ్య సేవలు అందజేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యదర్శి అరుణ, ఆర్.రేవతి, రమణి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం


వేడుకలు జరుపుకుంటున్న క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, ఆగస్టు 4 : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారం జరుపుకునే స్నేహితుల పండగ సందర్భంగా స్టేడియంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎంపీ రంగారావు, స్వామి, సంయుక్త కార్యదర్శులు వాకాడ శంకర్‌రెడ్డి, పిట్ల శ్రీను, ట్రెజరర్ అల్లు అప్పారావు పాల్గొన్నారు.

బీమా జీఎస్టీపై కేంద్ర మంత్రి గడ్కరీ స్పందన భేష్

- ఎల్ఐసీ ఏవోసీ స్టేట్ ఈసీ మెంబరు కేవీ రమణ

దేవరాపల్లి, ఆగస్టు 4 : జీవిత ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై ప్రభుత్వం విధిస్తున్న 18 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తొలగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాయడం సముచితమని ఎల్ఐసీ ఏవోసీ స్టేట్ ఈసీ మెంబరు కేవీ రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు యూనియన్ల అభ్యర్థన మేరకు మంత్రి గడ్కరీ లేఖ రాయడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం అధికారంలో ఉన్న మంత్రులు స్పందిం చి పాలసీలపై ప్రభుత్వం జీఎస్టీని ఉప సంహరించుకొనేలా ఒత్తిడి తేవాలని రమణ కోరారు.

చమ్మచింత అక్విడెక్ట్ గండికి మరమ్మతులు


అక్విడెక్ట్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 4 : చమ్మచింత అక్విడెక్ట్ వద్ద కుడి కాలువ గండి పనులు అధికారులు సత్వరమే స్పందించి చేపట్టడంతో పనులు పూర్తవుతున్నాయి. గత జూలైలో ఇక్కడ కుడికాలువకు గండి పడటంతో తాండవ డీఈ అనురాధకు స్థానిక మాజీ జడ్పీటీసీ సభ్యుడు తదితరులు ఫిర్యాదు చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. ఆమె వంటనే చర్యలు తీసుకున్నారు. దీంతో గండి పనులు పూర్తవడంతో ఈ ప్రాంత రైతులు ఊపరి పీల్చుకున్నారు. ఈ కుడికాలువ ద్వారా సుమారు 19వేల ఎకరాలు వరిపంట సాగవుతోంది. ఈ ఆగస్టు మూడోవారంలో తాండవ నీరు విడుదల చేసే ముందే గండి పనులు చాల వేగంగా పూర్తి చేసిన తాండవ అధికారులు, స్థానిక నాయకుడు కరక సత్యనారాయణను తాండవ ఆయకట్టు రైతులు అభినందిస్తున్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేయడమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

కోరినట్టు ఆయన చెప్పారు. అనకాపల్లికి పోలవరం నీరు తీసుకొచ్చి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. దీనికి అవసరమైన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఒకటి, రెండేళ్లలో ఈ ప్రాంతానికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు వస్తాయని తెలిపారు. జిల్లాలో హైడ్రోజన్ కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సానుకూలంగా ఉన్నారన్నారు. ఫర్నిచర్ తయారీ క్లస్టర్ ఏర్పాటు చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల వర్షాలకు జిల్లాలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ప్యాచ్ వర్క్‌లను తక్షణమే చేయాలని ఆదేశించామని చెప్పారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.400 కోట్లు గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు.గత వైసీపీ ప్రభుత్వం వల్లే జిల్లాలో రోడ్లు ఈ దుస్థితికి చేరాయని, కూటమి ప్రభుత్వం రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఆలోచన చేస్తున్నదని, త్వరలోనే రోడ్లు బాగుపడతాయని తెలిపారు. జాతీయ రహదారిపై వర్షాలకు దెబ్బతిన్న చోట ప్యాచ్ వర్కులను పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. కాగా రానున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పోటీలో ఉంటారని సీఎం రమేశ్ స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థి ఎవరనేది సీఎం చంద్రబాబు త్వరలోనే ప్రకటిస్తారన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, బీజేపీ, జనసేన నాయకులతో ఇప్పటికే చర్చించారని చెప్పారు. కూటమి తరపున ఎమ్మెల్సీగా పోటీ చేసే అభ్యర్థిని అంతా కలిసి గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు దాడి రత్నాకర్, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోపాలను చెప్పేవాడే నిజమైన స్నేహితుడు : ముక్కా


మహాలక్ష్మినాయుడుకు రక్షాబంధనం కడుతున్న స్నేహ యూత్ సభ్యులు

రావికమతం, ఆగస్టు 4 : మనలో ఉన్న లోపాలను సరిదిద్దే స్నేహితులను పొందడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముక్కా మహాలక్ష్మీనాయుడు అన్నారు.స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్నేహ యూత్ సభ్యులు మండల కేంద్రంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ స్నేహానికి కుల, మత, పేద, ధనిక వంటి ఎలాంటి భేదాలు లేవన్నారు. స్నేహితులు పరస్పరం రక్షా బంధానాలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా జోగేశ్వరావు, చప్పటి వెంకటరమణ, డి.రామకోటి, తోటరత్నం, వేపాడ లక్ష్మి, ఎ.గోవింద, కరణం శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో..

దేవరాపల్లి : మండల కేంద్రంలోని వెత్సా వీసాస్వామి మిల్లు వద్ద అర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. అంతా ఒక చోట కలిసి కేకులు కట్ చేసి పంచి పెట్టి ఆనందంగా గడిపారు.

రక్తదానం సామాజిక బాధ్యత

- వందేమాతరం బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినోద్‌బాలు తదితరులు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 4 : రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి రక్తదానం చేయాలని వందేమాతరం బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్‌బాలు కోరారు. వచ్చే అక్టోబర్ 2న వడ్డాదిలో నిర్వహించనున్న మెగా బ్లడ్ బ్యాంకు శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. 700 యూనిట్లు పైగా బ్లడ్ సేకరణ లక్ష్యంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎస్ఐ డి.ఈశ్వరరావు, అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంధ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రెల్లిలకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలి'

నర్సీపట్నం, ఆగస్టు 4 : వెనకబాటుకు గురైన రెల్లిలకు మూడు శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని నర్సీపట్నం రెల్లి సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి నిధులు సాధించడంతో రెల్లిలు, మాల, మాదిగలు కలిసికట్టుగా ఉండాలన్నారు. విభజన విషయంలో రెల్లిలకు, ఉపకులాలకు అన్యాయం జరిగిందని అన్నారు. కేంద్ర సంస్థల నుంచే వర్గీకరణ ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మంగళగిరి భగీరథ, చెన్నా శ్రీనివాసరావు, మజ్జి దినేష్, జీసీసీ మేనేజర్ భాస్కరరావు. ఉపాధ్యాయులు శివకేశవ, ప్రకాశ్, జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ సభ్యుడు అప్పల రాజు పాల్గొన్నారు.

మరటమ్మకు ఘనంగా పూజలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 4 : ఆదివారం అమావాస్య సందర్భంగా చినభీమవరంలో కొలువైయున్న మరటమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లాం, ఆర్.భీమవరం, చినభీమవరం, ఎం.భూపతిపాలెం, ఆర్.శివరామపురం, రాజాం, నీలకంఠాపురం తదితర గ్రామాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కె.కోటపాడు, ఆగస్టు 4 : మండల కేంద్రం రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ జూలై 30న విడుదలైన నేపథ్యంలో సెప్టెంబరు ఆరో తేదీ వరకు ఎన్నికల సంబంధించిన ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తదుపరి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రమేశ్‌బాబు తెలిపారు.

'కల్యాణపులోవ' నుంచి నీటి విడుదల రేపు

రావికమతం, ఆగస్టు 4 : రైతుల అభ్యర్థన మేరకు ఈనెల 6న కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు భూముల దమ్ములకు సాగు నీరు విడుదల చేయనున్నట్టు ఏఈ సత్యనారాయణ దొర తెలిపారు. ఈ రిజర్వాయర్ కింద చీమలపాడు, ములకాలపల్లి, జెడ్.కొత్తపట్నం,గంపవానిపాలెం, జెడ్.బెన్నవరం, కిత్తంపేట, దొండపూడి, కొత్తకోట, మత్స్యవానిపాలెం, మర్రివలస, కన్నంపేట తదితర పది పంచాయతీల పరిధిలో 4,784 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 458.8 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఏటా ఆగస్టు ఐదు లేదా ఆరు తేదీల్లో ఆయకట్టుకు నీరు విడుదల ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ



మాడుగుల రూరల్, ఆగష్టు 4 : మండలంలోని కేజేపురంలో కొలువైన మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు ఘటాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ధూప, దీప, నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాద వితరణగావించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఏపీఈఎమ్‌జేఏ కార్యవర్గం ఏకగ్రీవం

నర్సీపట్నం, ఆగస్టు 4 : ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీయూడబ్ల్యూజే అనుబంధం నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం స్థానిక ఎన్జీవోస్ హోమ్‌లో ఏపీ ఈఎంజేఏ రాష్ట్ర అధ్యక్షుడు చింతల కిషోర్ అధ్యక్షతన నర్సీపట్నం ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడుగా నీలాద్రి విజయ్‌కుమార్, కార్యదర్శిగా జె.శ్రీనివాసవర్మ, ట్రెజరర్‌గా నాయుడు, ఉపాధ్యక్షుడుగా ముమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా వి.శ్రీను, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు, సీనియర్ నాయకుడు సీహెచ్‌బీఎల్ స్వామి, సీహెచ్ రాము, ఇ.అప్పారావు, పసుపులేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

రోలుగుంట, ఆగస్టు 4 : మండలంలోని కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలనివ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో వీఆర్వోలను కలవాలని సూచించారు. ఈ కార్డుల వల్ల పంట నష్టపరిహారం, ఎరువులు, పురుగుల మందులపై రాయితీ వంటి సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలను పొందడానికి దోహదపడతాయని తెలిపారు.

శిరిజాంలో పారిశుధ్య నిర్వహణ


పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి పద్మావతి

చీడికాడ, ఆగస్టు 4 : మండలంలో శిరిజాం గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి పీలా పద్మావతి ప్రారంభించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని పలువురు కార్మికులతో అన్ని వీధుల్లో ఉన్న చెత్తచెదారం తొలగించి మురుగునీటిని శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లించారు. ఇప్పటికే గ్రామంలో ప్రాణాంతక దోమల నివారణకు స్ప్రేయింగ్ కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం


రోడ్డు మధ్యలో ఇబ్బందిగా ఉన్న విద్యుత్ స్తంభం

చోడవరం, జూలై 31 : విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్వాకం మూలంగా పట్టణంలోని కో-ఆపరేటివ్ కాలనీలోని కోనాం అతిథిగృహం వెనుకవైపు వీధిలోని విద్యుత్ స్తంభం స్థానికులకు ఇబ్బందిగా మారింది. కో-ఆపరేటివ్ కాలనీలోని వీధిలో రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభం వేయడంతో ఇది ప్రమాదభరితంగా తయారైంది. రహదారి పక్కన చాలా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ రోడ్డుకు ఆనుకుని మరీ వేసిన ఈ విద్యుత్ స్తంభం వల్ల రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఈ విద్యుత్ స్తంభానికి ఆనుకునే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు, రోడ్డుకు ఆనుకునే స్తంభం ఉండడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంది. ఈ రోడ్డు పక్కన వేసిన ఈ విద్యుత్ స్తంభాన్ని కొద్దిగా దూరం జరపాలని స్థానికులు ఈపీడీసీఎల్ అధికారులను ఎప్పటి నుంచో కోరుతున్నారు.అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.